క్లుప్తంగా

పర్యాటక రంగం అభివృద్ధికి కార్యాచరణ


పాశర్లపూడిలో స్థల సేకరణపై పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరంలో ఆహ్లాదకర వాతావరణంలో పర్యాటక రంగం అభివృద్ధికి కార్యాచరణ చేపడుతున్నామని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. పాశర్లపూడిబాడవలో పర్యాటక రంగం అభివృద్ధికి స్థల సేకరణ కోసం గుర్తించిన ప్రాంతాన్ని ఆయన శనివారం పరిశీలించారు. జిల్లాలో సర్క్యూట్ దేవాలయ టూరిజంను ప్రసాద్ స్కీమ్ ద్వారా అమలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే అక్కడ పర్యాటక రంగం అభివృద్ధికి కొంత మేర స్థలాన్ని కేటాయించామన్నారు. దానికి అనుబంధంగా మరింత విస్తరించాలన్న కోణంలో స్థల సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్డీఓ కె.మాధవి, తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ఎంపీడీఓ జి.భవాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో లాహితీతేజకు కాంస్యం

అంబాజీపేట: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారిణి జి.లాహితీతేజ కాంస్య పతకం సాధించినట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో లాహితీతేజను శనివారం అభినందనలు తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో లాహితీతేజ అత్యంత ప్రతిభ కనబర్చి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుందన్నారు. పతకం సాధించిన లాహితీతేజను హెచ్‌ఎం కడలి సాయిరామ్, పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు, పీఈటీ అందె సూర్యకుమారి, కోచ్ పితాని భార్గవిశ్రీకళ, భూషణం, ఎస్‌ఎంసీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఐదేళ్లు నిండిన పిల్లలను స్కూల్లో చేర్పించండి

మామిడికుదురు: ఐదేళ్లు వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ స్కూల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ జి.మమ్మి, సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. మామిడికుదురులో శనివారం జరిగిన మన పాఠశాల–మనందరి బాధ్యత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. మామిడికుదురు ఎమ్మార్సీ నుంచి జెడ్పీహెచ్ స్కూల్ వరకు ర్యాలీ జరిగింది. ఐదేళ్లు నిండిన ఏ ఒక్కరూ బడి బయట ఉండకూడదన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. బడి బయట ఉన్న పిల్లల్ని గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్నారు. దీని కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. అనంతరం ఎమ్మార్సీలో నిర్వహించిన సమావేశంలో ఇదే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉపాధి అవకాశాలు

అంబాజీపేట: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాలు ఉంటాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఇ.వసంతలక్ష్మి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన కెరీర్ గైడెన్స్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హైస్కూల్ దశ నుంచి విద్యపై మక్కువ సాధిస్తే భవిష్యత్ బంగారు బాట అవుతుందన్నారు. కష్టపడి ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. చెడు ప్రవర్తనలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీఎస్‌ఎన్‌ఎల్.మూర్తి, ఉమామహేశ్వరరావు, అరుణ్‌కుమార్, పీడీ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీపీ కేతా శ్రీనివాస్ మృతి

రాజోలు: మండల పరిషత్ అధ్యక్షుడు(ఎంపీపీ) కేతా శ్రీనివాస్(53) శనివారం మృతి చెందారు. ఈ నెల 24న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించిన ఆయన అదే రోజు బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయనకు శస్త్రచికిత్స జరిగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య లక్ష్మి ఉన్నారు. ఎంపీపీ మృతికి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తాటిపాక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ టీడీపీ జెండాను శ్రీనివాస్ పార్థివదేహంపై ఉంచి నివాళులర్పించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, శెట్టిబలిజ సంఘ నాయకులు నివాళులర్పించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి న్యూఢిల్లీకి చెందిన కె.శ్రీనివాస్ శనివారం రూ.10,116లు అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నిరుపయోగంగా కియోస్క్

- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో అన్నదాత అవస్థలు
- ఆర్‌ఎస్కేల్లో మూలకు చేరుతున్న యంత్రాలు


సంధిపూడి రైతుసేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్



పెదపళ్లలోని రైతు సేవా కేంద్రం

అలమూరు: వైఎస్సార్ సీపీ హయాంలో రైతుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చినా సేవలు మాత్రం పూర్తి స్థాయిలో రైతులకు అందడం లేదు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం (ఆర్‌ఎస్కేల్లో) కియోస్క్ పనిచేయకపోవడం వల్ల వరిసాగుకు సంబంధించి తగిన సమాచారం అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నదాతల ముంగిటకే మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో 2021 జూలై 08న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఈ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయానికి సంబంధించి విత్తు నుంచి విక్రయం వరకూ ఎరువులు, పురుగు మందుల లభ్యత తదితర అంశాలను అనునిత్యం తెలుసుకునేందుకు వీలుగా కియోస్క్‌లను ప్రవేశపెట్టింది.

కియోస్క్‌తో ప్రయోజనాలెన్నో..

కియోస్క్ ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. వాతావరణంలో మార్పులు తెలుసుకుని అందుకు అనుగుణంగా వ్యవసాయంలో వ్యవసాయశాఖ సూచనల మేరకు ప్రత్యామ్నాయ చర్యలను రైతులు తీసుకునే అవకాశం ఉండేది. పంట ఉత్పత్తుల మద్దతు ధరలు కూడా ఈ కియోస్క్‌ల్లో ఎప్పటికప్పుడు నిక్షిప్తమై ఉండేవి. ఎరువులు, పురుగుమందుల నిల్వలు, సంబంధిత సొసైటీలు, ప్రైవేట్ దుకాణాలు వివరాలు తెలుసుకునేందుకు రైతులకు అవకాశం ఉండేది. కియోస్క్ ద్వారా సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఎవరికి ఏ రకం విత్తనం కాని ఎరువులు కాని కావాలో తెలుసుకుని రప్పించే పరిస్థితి ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్‌లు ఉత్సవ విగ్రహాలుగా కనిపిస్తున్నాయి. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రైతులు సొసైటీలు, డీలర్ల వద్ద ఎరువు కొనుగోలు చేసుకుంటున్నారు.

కియోస్క్‌లు నిర్వీర్యం చేసేందుకే..

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కియోస్క్ యంత్రాలను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తూ రైతు సేవా కేంద్రాల లక్ష్యం నీరుగార్చుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ముద్ర లేకుండా చేయడం కోసం ఆర్‌బీకేల సేవలకు దశల వారీగా స్వస్తి పలుకుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలోని 254 గ్రామ సచివాయాల్లోనూ కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరితో కియోస్క్ యంత్రాలు అలంకారప్రాయంగా మారడంతో రైతులకు సక్రమంగా సేవలు అందడం లేదు.

మొబైల్ యాప్‌ల ద్వారా సమాచారం చేరవేస్తున్నాం



కియోస్క్ యంత్ర పరికరం మాదిరిగానే మొబైల్ యాప్‌ల ద్వారా క్షేత్రస్థాయి వ్యవసాయ సహాయకులు సేవలు అందిస్తున్నారు. వాటి ద్వారా రైతులు సమగ్రమైన సమాచారం అందుకుని దానికనుగుణంగా సాగు చేస్తున్నారు. రైతులకు ఏ విధమైన సమస్యలు ఉన్నా సత్వరమే వ్యవసాయశాఖను సంప్రదించే విధంగా చర్యలు తీసుకున్నాం.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏవో, ఆలమూరు

చంద్రబాబు మోసాలు ఇక సాగవు

మాజీ మంత్రి గొల్లపలి సూర్యారావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రాష్ట్రానికి పలు మార్లు సీఎంగా పని చేసిన చంద్రబాబునాయుడు తన మోసపూరిత వాగ్దానాలతోనే పాలన సాగిస్తూ రాష్ట్ర ప్రజలను ఏమారుస్తూ వస్తున్నారని, ఇకపై ఆయన మోసాలు ముందుకు సాగవని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ గ్రామ స్థాయి అధ్యక్షులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ పిలుపునిచ్చిన చంద్రబాబు మోసాలను గుర్తు చేస్తూ... గ్రామాల్లో పార్టీ నిర్వహించే కార్యక్రమాలపై ఆయన దిశా నిర్దేశం చేశారు. చంద్రబాబు మోసాలపై ప్రజలను అప్రమత్తం చేసి చైతన్య పరచడమే ఈ కార్యక్రమ ప్రధానోద్దేశమని సూర్యారావు అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో సూపర్‌సిక్స్ అమలు చేస్తామని చెప్పి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన చంద్రబాబును ప్రజలు గుర్తించారని అన్నారు. మాజీ సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలకు మంగళం పాడి, తాను ఇస్తాన్న సూపర్‌సిక్స్ పథకాలను కూడా అమలు చేయకుండా అమలు చేస్తున్న ప్రకటించిన సీఎంగా చంద్రబాబునే చూస్తున్నామని అన్నారు. ఇదే చంద్రబాబుకు ఆఖరి పాలన అన్నారు. ఇక భవిష్యత్‌లో తెలుగుదేశం పార్టీని ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని అన్నారు. కూటమి పాలనపై అసలు ఆ పార్టీ నేతల్లోనే అసంతృప్తి మొదలైందని సూర్యారావు అన్నారు. దీనిని గుర్తించిన చంద్రబాబు ప్రజలను, మీడియాను డైవర్ట్ చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. కూటమి అరాచకాలను ప్రజలకు తెలియజెప్పేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పార్టీ పార్టీ నాయకులు పాటి శివకుమార్, మండల శాఖల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాసరావు, గుర్రం జాషువా, తాడి సహదేవ్, జిల్లెళ్ల ఉదయ్‌కిరణ్, నల్లి రక్షణ, కొల్లాబత్తుల సతీష్, నాగరాజు, గుర్రం వెంకటనాగరాజు, యెనుముల చిట్టిబాబు, రావి త్రిమూర్తులు, నల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలి


కొత్తపేటలో ఉత్తమ విద్యార్థులకు నగదు అందజేస్తున్న డాక్టర్ రమణకుమార్, ఎంఈఓలు

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి, పలివెల గ్రామానికి చెందిన యర్రాప్రగడ సుబ్రహ్మణ్యం–శేషమాణిక్యాంబ దంపతుల కుమారులు డాక్టర్ రాజశేఖర్, వెంకటరమణ సోదరులు తమ తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం స్థానిక ప్రభుత్వ బాలురు, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానాలు సాధించిన ఉత్తమ విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నారు. దానిలో భాగంగా ఈ ఏడాది ఆయా పాఠశాలల నుంచి వై.దుర్గేశ్వర్, సయ్యద్ రషీదా బేగం ప్రథమ స్థానాలు సాధించగా వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను శనివారం ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం బండారు వీడీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమావేశంలో డాక్టర్ రాజశేఖర్ స్నేహితుడు డాక్టర్ రమణకుమార్, ఎంఈఓలు హరిప్రసాద్, లీలావతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా ప్రతిభ చాటుతున్న ఉత్తమ విద్యార్థులకు తమ తండ్రి పేరున పెద్ద మొత్తంలో నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న యర్రాప్రగడ సోదరులు అభినందనీయులని అన్నారు. అనంతరం వారికి అతిథుల చేతులు మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బీవీడీ సుబ్రహ్మణ్యం, ఎస్.సత్యనారాయణ, హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ నక్కా రామకృష్ణ, వన్రే అనంతలక్ష్మీకుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు జయంతి సోమయాజులు, స్కూల్ స్టాఫ్ సెక్రటరీ బండారు శేషు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన బోధన

మలికిపురం: పాఠశాలల్లో మెరుగైన బోధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని డీఈఓ షేక్ సలీం బాషా పేర్కొన్నారు. శనివారం మలికిపురం మండలంలో ఆయన పర్యటించారు. ఇరుసుమండ, గూడపల్లి కొప్పిడి వారి మెరక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలలలో మౌలిక వసతులపై విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. బోధన తీరు, ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనతో పాటు, మధ్యాహ్న భోజన పథకంపై నేరుగా విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎంఈవో ఎం.విజయశ్రీతో మాట్లాడారు. ప్రతి పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గూడపల్లి కొప్పిడివారి మెరక పాఠశాలలకు అదనపు గదులు, ఇంకా పలు సౌకర్యాలు కావాలని సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ కోరారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుందర బ్రహ్మయ్య, వార్డు సభ్యులు పున్నం నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు, సువర్ణరాజు, జీవీ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు జగ్గిరెడ్డి పరామర్శ


బ్లెస్సన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

ఆలమూరు: కర్తవ్య నిర్వహణలో వెళుతూ కారు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. ఆలమూరులో కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్ జీవన్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శనివారం పరామర్శించారు. కుటుంబసభ్యులైన తల్లి హెప్సిబా, సోదరులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం బ్లెస్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కొద్దిసేపు మౌనం పాటించారు. అలాగే నరసాపురంలోని రుస్తుంబాదలో మృతుడు ఎస్సై ఎం.అశోక్ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, రావాడ సత్తిబాబు, వి.దుర్గా భవానీ, నాంద్ర నాగ మోహన్‌రెడ్డి, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేరుగా ఉంచాలి

అంబాజీపేట: ఇళ్లలో వివిధ పదార్థాలను వినియోగించిన అనంతరం తడి, పొడి చెత్తలను వేరువేరుగా ఉంచి, పంచాయతీ పారిశుధ్య వాహనం వచ్చిన సమయంలో అందించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి శాంతాలక్ష్మి అన్నారు. మాచవరంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.భీమారావు అధ్యక్షతన తడి, పొడి చెత్తపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఇళ్లకు వెళ్లి తడి, పొడి చెత్తలను వేరు చేయడం వల్ల ఉపయోగాలను వివరించారు. ప్రతి ఇంటికీ రెండు ప్లాస్టిక్ డస్ట్ బిన్‌లు ఇచ్చారని వాటిలో తడి, పొడి చెత్తలను వేయాలన్నారు. తడి, పొడి చెత్త వల్ల సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, కార్యదర్శి కె.సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ బ్లెస్సన్‌కు ఘన నివాళి


ఆలమూరులో కానిస్టేబుల్ బ్లెస్సన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

ఆలమూరు: కర్తవ్య నిర్వహణలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్ జీవన్‌కు అశ్రు నయనాలతో పోలీసు శాఖ ఘన నివాళులర్పించింది. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, టౌన్ సీఐ ఎం.శేఖర్‌బాబు నేతృత్వంలో పోలీసు సిబ్బంది శనివారం ఆలమూరులోని కానిస్టేబుల్ బ్లెస్సన్ నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం బ్లెస్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘ మండలశాఖ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు నేతృత్వంలో సంఘ సభ్యులు కానిస్టేబుల్ బ్లెస్సన్ కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆలమూరు పోలీసు స్టేషన్‌లో మండల జర్నలిస్టు యూనియన్ శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై ఎం.అశోక్, కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్‌కు ఘన నివాళులర్పించారు. పాత్రికేయులతో ఫ్రెండ్లీగా ఉంటూ నేర సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసే ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ మృతి చెందడం బాధాకరమన్నారు. పాత్రికేయులు ఎల్లప్పుడూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటారని తెలియజేశారు. జర్నలిస్టు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.ఫణికుమార్ చౌదరి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలు జీవనశైలిని మెరుగుపరచుకోవాలి

కొత్తపేట: సమాజంలో మహిళలు ఆహార, ఆరోగ్య నియమాలు పాటిస్తూ జీవనశైలిని మెరుగుపరచుకోవాలని వేచి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం సూచించారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం ఆధ్వర్యంలో బోస్కో సేవా కేంద్రం వారి సహకారంతో విల్ లీడ్ కార్యక్రమంలో భాగంగా మహిళల జీవన శైలి పరిశుభ్రత ఆరోగ్యంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. శేషారత్నం మాట్లాడుతూ మహిళలు హైజెనిక్‌గా ఎలా ఉండాలి.. ఆరోగ్యంగా ఉండడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి.. రుతుక్రమంలో పాటించవలసిన జాగ్రత్తలు, తీసుకోవలసిన ఆహారపు అలవాట్లు ఆరోగ్య సూత్రాలను మహిళలకు వివరించారు. తద్వారా జీవన శైలిని మెరుగైన పద్ధతిలో ముందుకు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వీలైట్ మహిళా సభ్యులు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత అక్విడెక్టుపై చెత్త తొలగింపు పనుల ప్రారంభం


పి.గన్నవరం పాత అక్విడెక్టులో చెత్త తొలగింపు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పాత అక్విడెక్టుపై మొలిచిన రావిచెట్లు, అక్విడెక్టులో పేరుకుపోయిన తుప్పలు తొలగించేందుకు ఇరిగేషన్ డీఈ ఆర్.నాగార్జునరావు ఆధ్వర్యంలో శనివారం శ్రీకారం చుట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే గిడ్డి ప్రారంభించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగలక్ష్మి, డీసీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, వాసంశెట్టి కుమార్, షేక్ దొరబాబు, చిల్లా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ


సంధిపూడిలో విద్యార్థులకు బీబీఆర్ ఫౌండేషన్ ద్వారా నగదు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ జరిగింది. గ్రామీణ విద్యార్థులను చేయూతను అందించాలన్న ఉద్దేశంతో 2016లో బీబీఆర్ ఫౌండేషన్ ఏర్పాటు జరిగింది. అందులో భాగంగా చైర్మన్ బండారు శివరామకృష్ణ ఏటా తమ తల్లిదండ్రులు జ్ఞాపకార్థం ఈ నగదు బహుమతుల ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా స్థానిక హైస్కూల్‌లో శనివారం పదోతరగతిలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు సర్పంచ్ తోట భవాని, ఎంపీటీసీ తోలేటి సంతోషి, ఎస్‌ఎంసీ చైర్మన్ దొడ్డా రమేష్ చేతుల మీదుగా 2023–25 నుంచి రెండేళ్లకు సంబంధించి ప్రథమ స్థానాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు రూ.20 వేలు అందజేశారు. విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న బీబీఆర్ ఫౌండేషన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. దొడ్డా సుబ్బారావు, తోట వెంకటేశ్వర్లు, సిద్ధిరెడ్డి దుర్గాప్రసాద్, బొగడా అప్పారావు, సిద్ధిరెడ్డి రాంబాబు, పామర్తి ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

76 మంది ఉద్యోగాలకు ఎంపిక


పి.గన్నవరం: నిరుద్యోగ యువతకు వికాస ఆధ్వర్యంలో పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. 10 కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 163 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. వీరిలో 76 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వసంతలక్ష్మి, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, జె.రాజేంద్ర ప్రసాద్, గ్రేస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, ప్రిన్సిపాల్ పీవీఆర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు


మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఈఓ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టికెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,40,300 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.31,453 రాగా మొత్తం 1,71,753 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు భక్తుల అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

బాలాజీ దర్శనం.. భక్త పారవశ్యం


తొలి హారతి అందుకుంటున్న బాలబాలాజీ స్వామి

మామిడికుదురు: భారీ సంఖ్యలో హాజరైన భక్తులు శ్రీ, భూ సమేత బాల బాలాజీ స్వామిని దర్శించుకుని ఆనంద పరవశులయ్యారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామి వారి లక్ష్మీ నారాయణ హోమంలో పలువురు భక్తులు కర్తలుగా పాల్గొన్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,56,989 ఆదాయం వచ్చిందని ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.67,554 విరాళాలుగా సమర్పించారన్నారు. నాలుగు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, 2700 మంది అన్న ప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు.

పోటెత్తిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సందడి చేశారు. స్వామికి వివిధ పూజల ద్వారా రూ.2,42,102 ఆదాయం లభించింది. స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని 2900 మంది భక్తులు స్వీకరించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్సీ తోట

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన వెంట అయినవిల్లి గ్రామ మాజీ సర్పంచ్ అడ్డాల రాంబాబు తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

అంబాజీపేట: బంధువుల ఇంటికి వచ్చి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి అదృశ్యమైన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట మండలం గొల్లపాలేనికి చెందిన 19 ఏళ్ల యువకుడు దూనబోయిన యుగంధర్ నెల రోజుల క్రితం మాచరవంలో నివాసముంటున్న తన మేనత్త ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి తన మేనత్త ఇంటి వద్దే ఉంటున్నాడని ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. తన మేనత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి చెప్పారు.

పాము కాటుతో మహిళ మృతి

పి.గన్నవరం: మండలంలోని కె.ఏనుగుపల్లిలో శనివారం ఒక మహిళ పాము కాటుకు గురై మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన సానబోయిన సత్యవతి (44) శనివారం పొలంలో పనులు చేసుకుంటుండగా పాము కాటు వేసింది. దీంతో సత్యవతిని కుటుంబ సభ్యులు పి.గన్నవరం సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే ఆమె మృతి చెందింది. ఆమెకు భర్త అర్జునరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నట్లు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు.

కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి

మామిడికుదురు: బీసీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న ఉచిత కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి కలుగుతుందని ఎంపీడీఓ జి.భవాని తెలిపారు. పాశర్లపూడిలోని పాశర్లపూడి సత్రంలో జరుగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించారు. కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. శిక్షణ పొందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ 18న శిక్షణ కేంద్రం ప్రారంభమైందని శిక్షకురాలు మహేజాబీన్ తెలిపారు. 90 రోజుల శిక్షణలో ఇప్పటికి 60 రోజులు శిక్షణ ఇచ్చామన్నారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో రెండు బ్యాచులకు చెందిన 109 మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారని చెప్పారు. శిక్షణలో చెప్పే అంశాలను శ్రద్ధగా విని, ఆకళింపు చేసుకోవాలని ఎంపీడీఓ అభిలషించారు. ఆమె వెంట ఏఓ కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎంపీపీ మృతికి గొల్లపల్లి సంతాపం

మలికిపురం: రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్ మృతికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు శనివారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో ఉత్సాహవంతుడు, చక్కని రాజకీయ భవిష్యత్ ఉన్న నేతగా నిజాయితీతో ముందుకు సాగే శ్రీనివాస్ అకాల మృతి రాజోలు మండలానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

బీజామృతంతో వరి విత్తనశుద్ధి

మలికిపురం: మండలంలోని దిండి గ్రామంలో వరి నారుమడులు వేసే రైతులకు శనివారం సామూహిక శిక్షణ నిర్వహించారు. బీజామృతంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన శుద్ధి చేయించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం స్థానిక యూనిట్ ఇన్‌చార్జ్ కిరణ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తన శుద్ధి, నారు శుద్ధి చేయడం వల్ల విత్తనం నుంచి సంక్రమించే తెగుళ్లు అరికట్టుటకు దోహద పడుతుందన్నారు. అలాగే మొలక శాతాన్ని పెంచవచ్చన్నారు. దీని తయారీ కోసం ఎటువంటి పెట్టుబడి–ఖర్చు లేదని బీజామృతం సహాయంతో నారుశుద్ధి విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల పంటలకి రక్ష, రైతుకు భరోసా ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని రైతులకు వివరించారు. కాబట్టి రైతులు ఈ విధానాన్ని అవలంబించాలన్నారు. ఏవో సీహెచ్ రమ్య ప్రియాంక మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు విత్తనశుద్ధి నుంచి రాజీలేని సూత్రాలు పాటించడం ద్వారా పెట్టుబడి తగ్గించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్ మౌనిక, హరిబాబు, రైతులు సుబ్రమణ్యశర్మ, భాస్కరరావు, బాపయ్య పాల్గొన్నారు.